క్లుప్తంగా

గోపాలకృష్ణయ్య ఆదర్శప్రాయుడు



గోపాలకృష్ణయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

సీటీఆర్ఐ: స్వరాజ్య భిక్ష పేరుతో ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులకు భోజన సదుపాయం కల్పించిన స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఆదర్శప్రాయుడని ఆంధ్ర కేసరి యువజన సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. వావిలాల జయంతి సందర్భంగా స్థానిక ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. ఉద్యమ స్ఫూర్తితో సాగిన వావిలాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వక్తలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్‌కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అప్పారావు, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హోం కంపోస్టింగ్‌పై కార్యశాల



హోం కంపోస్టింగ్‌పై నిర్వహించిన పోటీల్లో ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్‌లో భాగంగా హోమ్ కంపోస్టింగ్ కార్యశాలను బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ గ్రీన్ ఏపీ ఆవశ్యకతను వివరించారు. పరిసరాలపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న మాట్లాడుతూ రకరకాల హోమ్ కంపోస్టింగ్‌తో కలిగే పలు లాభాలను వివరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సాసా కోఆర్డినేటర్ ఎం.విజయశాంతి, జి.రవితేజ జె.సురేష్, అనూష, సుభాషినిదేవి, సుబ్బలక్ష్మి, జరీనా, సీతామహాలక్ష్మి, డాక్టర్ యు.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పోలీసు అధికారులు

కంబాలచెరువు: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు భగవాన్ విశ్వకర్మ జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ సకల చరాచర సృష్టికి మూలకారకుడు విశ్వకర్మ భగవానుడని అన్నారు. ఏఎస్పీలు ఎంబీఎస్‌ఏవీ సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఏపీజీఈఏ జిల్లా కమిటీ



కలెక్టర్ కీర్తి చేకూరికి మొక్కను అందజేస్తున్న ఉద్యోగుల సంఘ నాయకులు

కడియం: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కీర్తి చేకూరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ప్రతినిధుల బృందం బుధవారం మర్యాద పూర్వకంగా కలిసింది. పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపింది. కార్యక్రమంలో సంఘ నాయకులు పి.గిరిప్రసాద్ వర్మ, సీహెచ్ విల్సన్‌పాల్, డీఎస్ చాంబర్లీన్, కె.వెంకటేశ్వరరావు, కె.దినేష్, జీవీ విజయకుమార్, డి.భగవాన్‌దాస్ తదితరులు ఉన్నారు.

వైద్యురాలికి షోకాజ్ నోటీస్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రోగి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు అందిన ఫిర్యాదు మేరకు స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యురాలికి కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. స్థానిక సుబ్బారావునగర్‌కు చెందిన జువ్వల రాజేష్‌కు డాక్టర్ అంజనిసువర్చనాదేవి వైద్య చికిత్స అందించారు. ఆ చికిత్స సక్రమంగా లేదని రోగి ఫిర్యాదు మేరకు కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

వృత్తులను వారసత్వ సంపదగా అందించాలి

రంగంపేట: భావితరాలకు నైపుణ్య వృత్తులను వారసత్వ సంపదగా అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరాం సూచించారు. స్థానిక పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను నిర్వహించారు.

ఆధ్యాత్మిక తీరం.. అవస్థలమయం

- ఘాట్‌లలో కొరవడిన రక్షణ
- భక్తుల పూజలకు ఇబ్బంది
- 50 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం



పుష్కర ఘాట్ పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



50 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం

సీటీఆర్ఐ: గోదావరి... ఈ మాట వింటేనే ఓ ఆధ్యాత్మిక ఒరవడి. అందుకే నదీ స్నానాలకు ఎంతోమంది వస్తుంటారు. గలగల పారే గోదావరిలో భక్తిశ్రద్ధలతో స్నానాలు చేసి తమ ఇష్టదైవాలను పూజిస్తుంటారు. ప్రస్తుతం దేవీ నవరాత్రులు వస్తుండడంతో భవానీ మాలధారులు ఎక్కువగా వస్తుంటారు. అంతేకాకుండా అయ్యప్ప, శివ, గోవింద మాలధారణ భక్తులతో గోదావరి తీరంలోని అన్ని ఘాట్‌లు కిటకిటలాడుతుంటాయి. ముఖ్యంగా స్థానిక పుష్కర ఘాట్‌లో ఎక్కువ మంది భక్తులు స్నానమాచరించడమే కాకుండా పూజలు చేస్తుంటారు. నగరంలోని భక్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తుంటారు. రోజుకు సుమారు 4 వేల మందికి పైగా వస్తుంటారని అంచనా. తెల్లవారుజామున 4 గంటల నుంచే తాకిడి మొదలవుతుంది. అయితే ఇక్కడ కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

22 నుంచి మరింత రద్దీ

ఈ నెల 22 నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్న దృష్ట్యా భవానీ భక్తులు, అయప్ప భక్తులు అధిక సంఖ్యలో పుష్కర ఘాట్‌లో స్నానాలు చేయనున్నారు. రోజుకు సుమారు పది వేల మంది వస్తారని అంచనా. ఇంత మంది భక్తులు ఘాట్లలో పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేయడానికి అధికారులు సరైన ఏర్పాట్లు చేయడం లేదు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి ఉధృతి పెరుగుతోంది. పుష్కర ఘాట్‌లో నీటిమట్టం బుధవారం 50 అడుగులకు చేరింది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ నీటి ఉధృతి చాలా అధికంగా ఉంటుంది. పుష్కర ఘాట్‌లో హెచ్చరిక స్తంభాలను ఏర్పాటు చేశారు. అవి దాటి భక్తులు స్నానాలకు వెళ్లకూడదనేది నిబంధన ఉంది. గోదావరి పెరగడంతో ఈ స్తంభాలు సైతం మునిగిపోయాయి. మూడో మెట్టు దాటిన తరువాత నీటి వడి అధికంగా ఉండడం, ఈ స్తంభాలు కనిపించకపోవడంతో స్నానాలకు వచ్చిన భక్తులు ప్రమాదాల బారిన పడే అవకాశం లేకపోలేదు.

హెచ్చరిక బోర్డులు అవసరం

స్నానాలకు వచ్చే భక్తులకు ఏ ప్రమాదం జరగకుండా నగరపాలక సంస్థ, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రాణనష్టం జరిగిన తరువాత మేల్కొనే కంటే ముందుగానే ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని అంటున్నారు. ఘాట్‌లు శుభ్రంగా లేకపోవడంతో పూజలు చేసుకునే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు.

జల్లు స్నానం ఎక్కడా?

చిన్న పిల్లలు, వృద్ధులు, వికలాంగుల కోసం పుష్కర ఘాట్ వద్ద జల్లు స్నానం ఏర్పాటు చేశారు. పండగలు, ఉత్సవాలు వంటి రోజుల్లో అక్కడి నుంచి నీటిని విడుదల చేస్తారు. కానీ దసరా పది రోజుల ముందు నుంచే భక్తులు అధిక సంఖ్యలో గోదావరికి వస్తున్నప్పటికీ ఇప్పటి వరకూ జల్లు స్నానానికి ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో జల్లు స్నానానికి ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించండి

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. ఘాట్‌ల వద్ద అపరిశుభ్రత లేకుండా చూడాలి. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. అధికారులు పర్యవేక్షణ ఉండాలి. ఉదయం, సాయంత్రం జల్లుస్నానం ఏర్పాటు చేయాలి. వీధి కుక్కలు ఘాట్‌లలో వచ్చి అపరిశుభ్ర వాతావరణం సృష్టిస్తున్నాయి. వాటిని అరికట్టాలి.

– టీ.సీతారామశాస్త్రి, భక్తుడు

మహిళల ఆరోగ్యం దేశానికి బలం



మహిళలకు పోషకాహార కిట్లను అందజేస్తున్న ఎంపీ, కలెక్టర్

ధవళేశ్వరం: మహిళల ఆరోగ్యం దేశానికి బలమైన పునాది అని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వద్ద స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ఎంపీ పురందేశ్వరి, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు జిల్లా వ్యాప్తంగా జరుగుతుందన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి బెనిడిక్ట్ సూచించారు. కోలమూరులో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనిని కాతేరు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్–3లో పీహెచ్‌సీ వైద్యురాలు నాగదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కడియం: స్థానిక ప్రాథమిక పాఠశాల– 2, కడియపులంకలోని మార్గాని కల్యాణ మండపం వద్ద స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారులు ఎం.మణిజ్యోత్స్న, ఎస్.జెస్సీ సుప్రియ మాట్లాడుతూ అక్టోబర్ రెండు వరకు ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వైస్ ఎంపీపీ పంతం గణపతి, సర్పంచులు మోసిగంటి సత్యవతి, పద్మావతి పాల్గొన్నారు.

వచ్చే నెల 26న శెట్టిబలిజ వన మహోత్సవం



సమావేశంలో పాల్గొన్న సానబోయిన రామారావు తదితరులు

సీటీఆర్ఐ: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 26న శెట్టిబలిజ వన మహోత్సవం, రాష్ట్ర స్థాయిలో శెట్టిబలిజ ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకులు వెల్లడించారు. స్థానిక ఓ హోటల్‌లో బుధవారం నగర శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథి, రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘ నాయకుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ శెట్టిబలిజ సామాజికవర్గ అభివృద్ధికి ఎన్నో త్యాగాలు చేసిన శెట్టిబలిజ పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి, కుడుపూడి సూర్యనారాయణ, కుడుపూడి ప్రభాకరరావు, కుడుపూడి చిట్టబ్బాయి, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, పిల్లి అప్పారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితర పెద్దల పేరిట అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. అలాగే శెట్టిబలిజ వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నామన్నారు. నగర సంఘ అధ్యక్షుడు మట్టపర్తి సత్యనారాయణ మాట్లాడుతూ వన భోజన మహోత్సవాన్ని స్థానిక జేఎన్ రోడ్డు చివర ఉన్న చెరుకూరి తోటలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి బొక్కా సత్య వెంకటప్రతాప్, నాయకులు బత్తిన ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బొమ్మూరులో ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు,



రాజమహేంద్రవరంలో విద్యుత్ ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం రూరల్: విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను విద్యుత్ యాజమాన్య సంస్థలు వెంటనే పరిష్కరించాలని ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్‌ఎం సర్కిల్ జేఏసీ చైర్మన్ జగతా అచ్యుతరామయ్య డిమాండ్ చేశారు. బొమ్మూరులోని 220 కేవీ సబ్ స్టేషన్ వద్ద బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఆయన ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కేఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. జేఏసీ కోశాధికారి పి.విజయశ్యామల మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకుడు గుత్తుల అన్నవరం ప్రసాద్, కాంట్రాక్టు కార్మిక సంఘ నేత డేవిడ్‌రాజు మాట్లాడుతూ విద్యుత్ యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలన్నారు. జేఏసీ నాయకులు అనిల్, గంగరాజు, కె.చంద్రశేఖరరెడ్డి, బాబి, జేఏఓ మంగాదేవి పాల్గొన్నారు.

కడియం: విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్‌ఎం సర్కిల్ జేఏసీ కన్వీనర్ రవికుమార్ డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో వేమగిరిలోని 400 కేవీ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో కాంట్రాక్టు కార్మికులను విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

రాజమహేంద్రవరంలో..

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని జేఏసీ చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు, కన్వీనర్ ఎ.రాజారత్నం అన్నారు. రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర, డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. దీనికి అన్ని డివిజన్ల యూనియన్లు, అసోసియేషన్ల నుంచి పెద్దఎత్తున విద్యుత్ ఉద్యోగులు హాజరయ్యారు. విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చుల చెల్లింపు, రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో జాతీయ ఫొటోగ్రఫీ, ఆర్ట్ షోకేస్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ జస్టిస్ ఫర్ ఆల్ త్రో ద లెన్స్ ఆఫ్ లీగల్ ఎయిడ్ అనే ఏకీకృత అంశంతో జాతీయ ఫొటోగ్రఫీ, ఆర్ట్ షోకేస్ ప్రారంభించామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయ సహాయం సేవల పరిధి, ప్రభావాన్ని సృజనాత్మకంగా ప్రజల ముందుకు తీసుకువెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఆసక్తి ఉన్న ప్రజలు, ఆయా రంగాల్లో ప్రతిభ కలిగిన వారి నుంచి ఫొటోలు, పెయింటింగ్స్, స్కెచ్‌లు, అలాగే గరిష్ఠంగా ఒక నిమిషం నిడివి గల షార్ట్ వీడియోలను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు అక్టోబర్ 1వ తేదీ లోపు తమ దరఖాస్తులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం, జిల్లా కోర్టు, రాజమహేంద్రవరం అనే చిరునామాకు అందజేయాలన్నారు. జిల్లా న్యాయ సేవా సంస్థ ద్వారా అందిన ప్రతులను స్క్రీనింగ్ చేసి, రాష్ట్ర న్యాయ సేవా సంస్థకు పంపుతామన్నారు. ఎంపికైన ఉత్తమ కృతులను జాతీయ స్థాయికి పంపి ప్రదర్శనలో భాగంగా చేయనున్నామన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్థానిక కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ హిందూ పురాణాల ప్రకారం విశ్వకర్మ మహోన్నత వ్యక్తిగా అత్యున్నత స్థానం సంపాదించారని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక పాల్గొన్నారు.

గణపవరం మండలాన్ని ఏలూరులో కలపొద్దు

రాజమహేంద్రవరం సిటీ: పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న గణపవరాన్ని ఏలూరు జిల్లాలో కలపవద్దని అక్కడి అఖిలపక్ష నాయకులు రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు. బుధవారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయనను కలసి వివరాలు వెల్లడించారు.

బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి



కడియంలో రణభేరి జాతాలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కడియం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడిన రూ. 20 వేల కోట్లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎన్.అరుణకుమారి, జ్యోతిబసు, టి.చక్రవర్తి డిమాండ్ చేశారు. గోకవరం నుంచి యూటీఎఫ్ చేపట్టిన రణభేరి జాతా బుధవారం కడియం చేరుకుంది. ఇక్కడి హైస్కూల్ వద్ద యూటీఎఫ్ నాయకులు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు కావొస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కనీసం స్పందించడం లేదన్నారు. ఈ నెల 15న మొదలైన ఈ రణభేరి 19తో ముగుస్తుందన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే విజయవాడలో ఇరవై వేల మంది టీచర్లతో ఈ నెల 25న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామన్నారు. కడియం మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్బాయి, వేదుల శాస్త్రి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల జాతాకు ఘన స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు బైకులపై ర్యాలీగా వేమగిరి చేరుకుని అక్కడి నుంచి కడియం హైస్కూల్‌కు రణభేరి జాతాను తోడ్కొని వచ్చారు.

అనంతరం కడియం నుంచి కేశవరం మీదుగా కోనసీమ జిల్లాకు జాతా బయలుదేరి వెళ్లింది. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పి.జయకర్, ఎ.షరీఫ్, ఈవీఎస్ఆర్ ప్రసాద్, విజయ్‌గౌరి, కె.రమేష్, చిలుకూరి శ్రీనివాసరావు, శ్రీమణి, శ్రీనివాసమూర్తి, మనోజ్, నర్సారెడ్డి, రూపస్‌రావు, ఎస్.అనిత, ఎం.శ్రీనివాస్, ప్రకాష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులపై నిరసన

సీతానగరం: రఘుదేవపురం – సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు పనులపై నిరసన వ్యక్తమైంది. కాతేరు నుంచి రఘుదేవపురం వరకూ నాలుగు లైన్ల రోడ్డు వేశారు. ఇక్కడి నుంచి సీతానగరం వరకూ పాత రోడ్డు సెంటర్ నుంచి అటు, ఇటు ఐదు మీటర్లు (30 అడుగులు) రోడ్డుతో సరిపెడుతున్నారు. బుధవారం ఆర్అండ్‌బీ అధికారులు రఘుదేవపురం నుంచి రోడ్డు పనులు చేపట్టగా, స్థానికులు కందుల హరి శ్రీనివాసరావు, వీరవరపు శివలు పాత రోడ్డు సెంటర్ నుంచి అటు, ఇటు పనులు ప్రారంభించాలని కోరారు. రోడ్డు వేస్తామంటే తమ స్థలాలు స్వచ్ఛందంగా ఇచ్చామని, అటువైపున స్థలాలు ఇవ్వలేదని, అటువంటిది తమ వైపు రోడ్డు ఎక్కువ వేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. పాతరోడ్డు మధ్య నుంచి అటు, ఇటు ఐదు మీటర్లు వేయాలని అన్నారు. దీంతో అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి ప్రభుత్వ పనులను అడ్డుకుంటే కేసులు అవుతాయని హెచ్చరించారు. దీనితో స్థానికులు మిన్నకుండిపోయారు. తిరిగి సాయంత్రం పనులు అడ్డుకుని, పాతరోడ్డు మధ్య నుంచి కొలతలు చూపించాలని ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమణను నిలదీయడంతో గురువారం అధికారులు వచ్చి కొలతలు చూపిస్తారని, అంతవరకూ రోడ్డు పనులు నిలిపివేస్తామని తెలిపారు.

దేవీ నవరాత్ర ఉత్సవాలకు శ్రీకారం

పెదపూడి: వచ్చే నెల 2న నుంచి జరిగే విజయ దశమి ఉత్సవాలకు సంబంధించి సంపర నాగిరెడ్డివారి వీధిలో దుర్గాదేవి అమ్మవారి మంటపం వద్ద బుధవారం పందిరి రాట వేశారు. వేద పండితుడు ఖండవల్లి హనుమంతాచార్యులు మాట్లాడుతూ 22 నుంచి శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ఉదయం మంటపం వద్ద విఘ్నేశ్వర పూజ, అనంతరం దుర్గాదేవి అమ్మవారికి పూజలు చేశారు.

శ్రీరాముని జన్మ నక్షత్ర పూజలు

పెదపూడిలోని మధ్యవీధి నూతన రామాలయంలో శ్రీరాముని జన్మ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామనాథ కాశ్యప శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేత కాకర సాయిబాబు, భక్తులు, గ్రామస్తులు నూనె కృష్ణమూర్తి, మార్ని కామరాజుచౌదరి, నూనె వెంకటేశ్వరరావు చౌదరి, మార్ని పెద వెంకట్రావు, నూనె రాజుచౌదరి పాల్గొన్నారు.

పందలపాకలో..

బిక్కవోలు: పందలపాకలోని వెలంపేట రామాలయం వద్ద ఈ నెల 22 నుంచి దేవీ నవరాత్రులను పురస్కరించుకుని రాట ముహూర్తం చేశారు. సర్పంచ్ సబ్బారావు పద్మావతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సబ్బారపు సూర్యనారాయణరెడ్డి, పంచాయతీ వార్డు సభ్యుడు గుల్లిపిల్లి శ్రీను పాల్గొన్నారు.అలాగే శ్రీసంతోషి మాత ఆలయం వద్ద రాట మంచి కార్యక్రమం నిర్వహించారు.

పారదర్శకతతోనే ప్రగతి పథాన దేశం

రాజమహేంద్రవరం సిటీ: మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో పలు సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొని మాట్లాడుతూ మోదీ దూరదృష్టి, పారదర్శకతతో దేశాన్ని అభివృద్ధి పథాన నిలుపుతున్నారన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విశ్వకర్మ జయంతిలో వారు పాల్గొన్నారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు.

ధవళేశ్వరం: ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని ధవళేశ్వరం లక్ష్మీజనార్దన కాలనీలో రూరల్ 3వ మండల అధ్యక్షుడు షేక్ సాజిద్ అధ్యక్షతన సేవ పక్వాడ్ కార్యక్రమం కన్వీనర్ కంచుమర్తి జగన్నాథం, కో–కన్వీనర్ కూరెళ్ల రామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సినీ నటుడు, బీజేపీ నాయకుడు బాలాజీ, ఈఎస్ఐ బోర్డు సభ్యులు ఒంటిద్దు స్వామి, ఏఎంసీ డైరెక్టర్ పన్నాల వెంకట లక్ష్మీసంతోషి పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రోత్సాహానికే క్రికెట్ పోటీలు



క్రికెట్ కప్ లోగోను ఆవిష్కరిస్తున్న జేమ్స్ వాట్ తదితరులు

సీటీఆర్ఐ: క్రీడాకారులను ప్రోత్సహించడానికి నగరంలో రాజమండ్రి కార్పొరేట్ క్రికెట్ కప్ 2025 పేరిట పోటీలు నిర్వహిస్తున్నామని సోనూస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము అన్నారు. బుధవారం స్థానిక షెల్టాన్ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో క్రికెట్ కప్ లోగోను ఆవిష్కరించారు. డ్రా తీసి మూడు గ్రూపులుగా టీమ్‌లను విభజించారు. ఈ పోటీలు స్థానిక ఎస్పీ గ్రౌండ్‌లో వచ్చే నెలలో ప్రారంభమవుతాయన్నారు. క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని ఆయన అన్నారు. తాను అమెరికాలో సంస్థను నిర్వహిస్తున్నా తన సొంత ఊరు రాజమండ్రిలో కూడా ఈ సంస్థ బ్రాంచి ఏర్పాటు చేసి పేదలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము చెప్పారు. నిర్వాహకుడు బాలాజీ, కార్పొరేట్ సంస్థల నుంచి క్రికెట్ టీం కెప్టెన్లు హాజరయ్యారు.

రేపు ప్రేక్షకుల ముందుకు ‘వీర చంద్రహాస’

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కన్నడలో సూపర్ హిట్‌గా నిలిచి 100 రోజులు ప్రదర్శించబడిన వీర చంద్రహాస సినిమాను ఈ నెల 19న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నామని ఆ చిత్ర నిర్మాత, సోనూస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ జేమ్స్ వాట్ కొమ్ము వెల్లడించారు. స్థానిక షెల్టాన్స్ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో తాను నిర్మించిన ‘ఆర్టిస్ట్’ చిత్రానికి మంచి పేరొచ్చిందన్నారు. త్వరలోనే ఈ చిత్రం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌కు రానుందన్నారు. కన్నడంలో సూపర్ హిట్ అయిన వీర చంద్రహాసను మన తెలుగు ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో ఎంపీ రాధాకృష్ణతో కలసి దీనిని తెలుగులో విడుదల చేస్తున్నామన్నారు. కేజీఎఫ్, సలార్ వంటి భారీ చిత్రాలకు సంగీతం సమకూర్చిన రవి బస్రూర్ ఈ చిత్రానికి దర్శకత్వంతో పాటు, సంగీతం అందించారని తెలిపారు. యక్షగానం కళాకారుల జీవితం ఆధారంగా మైథలాజికల్ చిత్రంగా రూపొందించారన్నారు. శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో కేజీఎఫ్, సలార్ చిత్రాల్లో నటించిన నటులు కనిపిస్తారని తెలిపారు.

ఇంటింటా చెత్త సేకరణ పరిశీలన



జేగురుపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రామ్‌గోపాల్, సర్పంచ్

కడియం: జేగురుపాడు గ్రామంలో జరుగుతున్న ఇంటింటా చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీ వంటి పనులను బుధవారం డిప్యూటీ సీఈఓ రామ్‌గోపాల్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ చెత్త సేకరణ కార్యక్రమం అమలుపై ఆ గ్రామస్తులు, పారిశుధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పని తీరును కూడా ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్, కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావులను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పని తీరు బాగుందని ఆయన అభినందించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు

కంబాలచెరువు: స్థానిక ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్పా సెంటర్లలో బెడ్స్ ఉన్న రూమ్‌లను నిర్వాహకులచే బుధవారం మూయించి వేశామని ఇన్‌స్పెక్టర్ బాజీలాల్ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఇటీవల పలు స్పా సెంటర్లపై దాడులు చేశామన్నారు. పలుచోట్ల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం మేరకు బెడ్స్ ఉన్న రూమ్‌లను క్లోజ్ చేయించామన్నారు.